నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, బుధవారం 30 అక్టోబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

''ఒకే పోలీస్ - ఒకే విధానం' అంటూ హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చాక మాట తప్పాడు. ఆయన హామీని గుర్తుచేసి మా సమస్యలు పరిష్కరించుకునేందుకే మా భార్యాబిడ్డలతో కలిసి రోడ్డెక్కాల్సి వచ్చింది. హైదరాబాద్‌లో కుమారి ఆంటీ భోజనంపై స్పందించిన సీఎం.. నాలుగు రోజులుగా ఆందోళన చేస్తున్నా మా సమస్యలపై నోరు మెదపకపోవడం బాధాకరం.' అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు చాతకొండ ఆరో బెటాలియన్ పోలీసులు. ఆందోళన గురించి అడిగి తెలుసుకొని సమస్యలను పరిష్కరించకపోగా.. ప్రశ్నించిన పోలీసులను సస్పెండ్ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన హామీని ప్రభుత్వం విస్మరించిన నేపథ్యంలో.. తాము ఎందుకు ఆందోళన చేపట్టాల్సి వచ్చిందో, బెటాలియన్లలో తమ బతుకులు ఎలా నలిగిపోతున్నాయో వారే వివరిస్తున్న అంశంపై ప్రత్యేక కథనం.


3rd C&CC Control
This message was deleted 11:04 am
Good morning to all .
Please obtain willingness from your Coy personnel in the rank of PC/HC (must and should be veg cook) to work at the residence of Sri Sanjay Kumar Jain, IPS., ADGP TGSP Bns.
If any willingness please inform the Bn office.
If anyone is willing to do this job send your willingness application to the HQ Coy office.FFI 11:06 am

పేరుకు పోలీసులం..

బెటాలియన్లలో బానిసలం

- యూనిఫాం సర్వీసు అనుకొని వస్తే మొత్తానికే ఉతికి ఆరేస్తున్నారు..
- గడ్డి చెక్కిస్తున్నారు.. తాపీ పట్టిస్తున్నారు.. అధికారిక భవనాలు కట్టిస్తున్నారు..
- ఇసుక మోయిస్తున్నారు.. డ్రైవర్, తోటమాలి, కుక్ పనులు చేయిస్తున్నారు.
- వారి పెంపుడు కుక్కలకు వాకింగ్, బాతింగ్ కూడా మాతోనే చేయిస్తున్నారు..
- ప్రభుత్వ వాహనాలను పెద్దసార్ల కుటుంబాల షాపింగ్‌లకు తీసుకెళ్తున్నారు..
- మరి మమ్మల్నెందుకు సార్.. మనోవేదనకు గురిచేస్తున్నారు?
- ఆర్డర్లీ వ్యవస్థ పేరిట వెట్టి చాకిరీపై బెటాలియన్ కానిస్టేబుళ్ల ఆవేదన
- 'పోలీసులందరికీ ఒకే రూల్' హామీపై సీఎం మాట తప్పారంటూ ఆరోపణ

లక్ష్మీదేవిపల్లి, అక్టోబర్ 29: పేరుకు పోలీసులమైనా బెటాలియన్లలో బానిసలకంటే హీనమవుతున్నామంటూ చాతకొండ ఆరో బెటాలియన్ పోలీసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసు ఉన్నతాధికారులు తమతో చేయిస్తున్న చాకిరీని చూస్తుంటే తాము తోటి పోలీసులమా? తోటమాలీలమా? అనే సందేహం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖాకీ డ్రెస్ వేసుకుని శాంతిభద్రతల పరిరక్షణలో భాగమవుదామనుకున్న తమకు భంగపాటే ఎదురవుతోందని బోరుమంటున్నారు. పోలీసుగా గర్వపడదామంటే తమతో గొడ్ల చావిడిలో గొడ్డు చాకిరీ చేయిస్తున్నారంటూ గోడు వెళ్లబోసుకుంటున్నారు. సమస్యలు చెప్పుకుందామంటూ కాంగ్రెస్ సర్కారు ఆగ్రహానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హామీలు అమలు చేయాలని అడిగినందుకు ప్రభుత్వం తమ ఉద్యోగాలను పీకిపారేస్తోందని వాపోతున్నారు. డిగ్రీలు, పీజీలు చదివి.. యూనిఫాం కొలువులపై మక్కువతో పోలీసు శాఖలోకి వస్తే.. తమతో పశువుల పేడ కూడా తీయిస్తున్నారని తలలు పట్టుకుంటున్నారు.

'యూనిఫాం సర్వీసు అనుకుంటే ఉతికి ఆరేస్తున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకే రోల్ కాల్ ప్రారంభిస్తున్నారు. విధుల్లో భాగమేనని అనుకుంటే.. శ్రమదానం పేరిట శ్రమదోపిడీ చేస్తున్నారు. ఆ సమయంలో మాతో గడ్డి చెక్కిస్తున్నారు. తరువాత నదుల నుంచి ఇసుక మోయిస్తున్నారు. తాపీ పట్టిస్తున్నారు. అధికారిక భవనాలు కట్టిస్తున్నారు. ఈ క్రమంలో మా బెటాలియన్‌లో ఉన్న అన్ని వసతి గృహాలను, క్యాంటీన్‌ను, అధికారుల భవనాలను మేమే కట్టాం. ఆర్డర్లీ వ్యవస్థ పేరిట ఉన్నతాధికారులు మాతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారు. మా బెటాలియన్‌లో ఉన్న 50 శాతం మంది కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లను ఇందుకోసమే వినియోగిస్తున్నారు. ఉన్నతాధికారులు వారి ఇంటి పనులనూ మాతోనే చేయిస్తున్నారు. డ్రైవర్లుగా, తోటమాలీలుగా, వంట మనుషులుగా పనులు చేయిస్తున్నారు. చివరికి వారి కుక్కలకు కూడా మాతోనే వాకింగ్ చేయిస్తున్నారు. స్నానాలు సైతం చేయిస్తున్నారు. మా బెటాలియన్ అధికారిక వాహనాలను కూడా ఉన్నతాధికారులు వారి కుటుంబ అవసరాల కోసం, షాపింగ్‌ల కోసం వినియోగిస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రతీ పోలీస్ అధికారి దగ్గర 10 నుంచి 15 మందిమి ఆర్డర్లీగా పనిచేస్తున్నాం. గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఇంటెలిజెన్స్ వంటి విభాగాల్లో 30 శాతం మందిమి విధులు నిర్వహిస్తున్నాం. ముఖ్యమంత్రి, మంత్రుల సెక్యూరిటీ వింగ్, ఎస్‌ఐబీ సహా ఇతర అన్ని వింగ్‌లలో వంద శాతం మేమే ఉంటున్నాం. ఏ మూలన ఎక్కడ అలజడి జరిగినా ఫోర్స్ రూపంలో మేమే వెళ్లి శాంతిభద్రతల పరిరక్షణలో పాల్గొంచుకుంటున్నాం. ఈ క్రమంలో మా కుటుంబాలకు మేం దూరమవుతున్నాం.' అంటూ తెలంగాణ స్పెషల్ పోలీసు (టీజీఎస్‌పీ) విభాగానికి చెందిన బెటాలియన్ల కానిస్టేబుళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'అయినా మమ్మల్నెందుకు సార్.. చులకనగా చూస్తున్నారు?' అంటూ ప్రశ్నిస్తున్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న బెటాలియన్ కానిస్టేబుళ్లు (ఫైల్)

పేడ తీస్తున్న కానిస్టేబుల్ (ఫైల్)

ఉన్నతాధికారి సోషల్ మీడియా పోస్టుపై ఆగ్రహం..

వెట్టి చాకిరీ నుంచి విముక్తి కావాలని ఆందోళన చేస్తున్న ఈ తరుణంలో హైదరాబాద్‌లో ఓ ఉన్నతాధికారి సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుపై బెటాలియన్ల కానిస్టేబుళ్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'కుకింగ్ కోసం ఇద్దరు కావాలి. ఆసక్తి ఉన్న సిబ్బంది కార్యాలయంలో తెలియజేయండి' అంటూ పెట్టిన మెసేజ్‌పై భగ్గుమంటున్నారు.

అంత తప్పు నేనేమీ చేయలేదు..

నన్ను డిస్మిస్ చేసేంత తప్పు నేనేమీ చేయలేదు. మా వెట్టి చాకిరీ గురించి పోరాడితే అధికారులు నన్ను సస్పెండ్ చేశారు. అంతటితో ఆగకుండా డిస్మిస్ కూడా చేశారు. ఈ బానిస బతుకులు మాకొద్దు. కామన్ పోలీసులకు దక్కుతున్నట్లుగా మాకూ గౌరవ మర్యాదలు దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

–భూషణ్‌రావు, ఆరో బెటాలియన్

'ఒకే పోలీస్ - ఒకే విధానం' ఉండాలి

ఒకే పోలీస్ – ఒకే విధానం' ఉండాలంటూ బెటాలియన్ కానిస్టేబుళ్లు డిమాండ్ చేస్తున్నారు. 'ఏక్ పోలీస్' విధానం ప్రకారం.. ప్రతి పోలీసూ టీజీఎస్‌పీ నుంచే భర్తీ అవ్వాలని, ఇక్కడి నుంచి మాత్రమే ఏఆర్, సివిల్‌కి కన్వర్ట్ కావాలని కోరుతున్నారు. టీజీఎస్‌పీలో మెస్, రికార్డు పర్మిషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. డిస్ట్రిక్ట్ హెడ్ క్వార్టర్స్/ ఎస్పీ/ సీపీలకు అటాచ్ ఇచ్చి 3–5 ఏళ్ల పోస్ట్ మార్చకుండా కుటుంబాలతో కలిసి జీవించేలా సౌకర్యం కల్పించాలని వేడుకుంటున్నారు. ఫటిగ్, హాలీడేలో రోల్ కాల్, ఆర్డర్లీ వ్యవస్థ వంటివి రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అందరికీ ఒకే యూనిఫాం ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పక్కా ప్రణాళికతో రండి: ఉన్నతాధికారులు

బెటాలియన్ పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటిపై వారం రోజుల్లో పక్కా ప్రణాళికతో రావాలని ఉన్నతాధికారులు మౌఖికంగా ఆదేశాలు జారీ చేశారు. దీంతో మూడు రోజులుగా ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తున్న చాతకొండ ఆరో బెటాలియన్ పోలీసులు మంగళవారం తమ నిరసనను తాత్కాలికంగా వాయిదా వేశారు.

ఖమ్మం ఏఎంసీ పత్తి యార్డుకు రైతులు తీసుకొచ్చిన బస్తాలు

పోటెత్తిన పత్తి

- ఖమ్మం ఏఎంసీకి 20 వేల బస్తాలు రాక
- వరుస సెలవుల నేపథ్యంలో విక్రయానికి మొగ్గు

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 29 : ఖమ్మం వ్యవసాయ మార్కెట్ పరిధిలోని పత్తి యార్డుకు రెండో రోజు మంగళవారం సైతం పత్తి పోటెత్తింది. జిల్లా రైతాంగంతో పాటు పొరుగున ఉన్న భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల నుంచి రైతులు సుమారు 20 వేల బస్తాల వరకు తరలించారు. దీనికితోడు సోమవారం తరలించిన పత్తి క్రయవిక్రయాలకు నోచుకోకపోవడం.. ఆ పంట సైతం యార్డులోనే ఉండడంతో ఎటు చూసినా తెల్లబంగారమే దర్శనమిచ్చింది. ఉదయం 10 గంటల సమయంలో జరిగిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో క్వింటా గరిష్ఠ ధర రూ.6,800 పలుకగా.. కనిష్ఠ ధర రూ.6 వేలు, మధ్య ధర రూ.6,600 చొప్పున పత్తి ఖరీదుదారులు పంటను కొనుగోలు చేశారు. అయితే గురువారం నుంచి మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవులు ప్రకటించడం, దీపావళి పండుగ కావడంతో పత్తితీత కూలీలు తమ కూలి డబ్బులు డిమాండ్ చేయడం.. నాలుగు రోజుల తర్వాత ధర తగ్గే అవకాశం ఉన్నదని అడ్తీ వ్యాపారులు పదే పదే రైతులకు ఫోన్లు చేయడం వంటి పరిణామ క్రమాల్లో సరుకును భారీగా విక్రయానికి తరలించినట్లు తెలుస్తున్నది. అంతేకాక గ్రామాల్లో పత్తి కొనుగోళ్లు జరుగుతుండడంతో ఇంటి వద్ద అమ్ముకుంటే మంచి ధర రాదనే ఉద్దేశంతో రైతులు మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే సీసీఐ కేంద్రాలకు వెళ్లాల్సిన పత్తి వాహనాలు ప్రైవేట్ వ్యాపారుల వద్దకు వెళ్తుండడం ఆశ్చర్యానికి గురి చేస్తున్నది.

ఎర్రబంగారం ధర నేలచూపులు..

మిర్చి యార్డుకు శాంపిల్ రూపంలో రైతులు తీసుకొచ్చిన ఏసీ బస్తాలు

గత ఏడాది ఇదే రోజుల్లో ఓ వెలుగు వెలిగిన తేజా రకం ఏసీ మిర్చి ధర ఈ ఏడాది వరుసగా పతనమవుతూ నేలచూపులు చూస్తున్నది. పంట సీజన్‌లో అమ్ముకుంటే ఆశించిన ధర రాదనే ఉద్దేశంతో క్వింటా ధర రూ.20 వేలు పలికినా చాలా మంది రైతులు, కొందరు వ్యాపారులు కోల్డ్ స్టోరేజీలలో నిల్వ చేశారు. ఆ తర్వాత పంట ధరపై ఎన్నో ఆశలు పెట్టుకున్నా.. నెల రోజులుగా తగ్గుతూ రూ.19 వేల దిగువకు చేరింది. మంగళవారం జరిగిన జెండాపాటలో ఏసీ రకం క్వింటా గరిష్ఠ ధర రూ.18,700 పలుకగా, కనిష్ఠంగా రూ.10 వేలు మాత్రమే పలికింది. దీంతో ఇంతకాలం పంటను దాచుకున్న రైతుల ఆశలు ఆవిరయ్యాయి. సాధారణంగా కొత్త పంట వచ్చే వేళ పెరగాల్సిన ఏసీ రకం మిర్చి ధరలు అమాంతంగా తగ్గుతుండడంతో అటు రైతులు, ఇటు కొందరు వ్యాపారులు దిగాలు పడుతున్నారు.

రేపటి నుంచి మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవులు

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 29: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు ఈ నెల 31వ తేదీ నుంచి వరుసగా నాలుగు రోజులపాటు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం దీపావళి పర్వదినం, ఒకటో తేదీ అమావాస్య, 2వ తేదీ శనివారం, 3వ తేదీ ఆదివారం వారాంతపు సెలవు కావడంతో క్రయవిక్రయాలు ఉండవని పేర్కొన్నారు. సోమవారం నుంచి మార్కెట్‌లో క్రయవిక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని, రైతులు ఈ విషయాన్ని గ్రహించి సెలవులు రోజుల్లో మార్కెట్‌కు సరుకులు తీసుకురావొద్దని కోరారు.

కొనుగోళ్లలో మోసం చేస్తే క్రిమినల్ కేసులు

- సన్నరకం వరికి రూ.500 బోనస్ ఇస్తున్నాం..
- డిసెంబర్ లోపే రూ.13 వేల కోట్ల రుణమాఫీ చేస్తాం
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి(తిరుమలాయపాలెం), అక్టోబర్ 29 : పత్తి, ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని, తేమ పేరుతో పత్తి, తరుగు పేరుతో ధాన్యం కొనుగోళ్లలో మోసాలు, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు క్రిమినల్ కేసులు పెడతామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. తిరుమలాయపాలెం మండలం గోల్ తండాలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలతో జిల్లాలో పత్తి రైతులకు నష్టం వాటిల్లిందని, అలాంటి వారికి ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. జిల్లాలో 2 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి పంట పండించారని, 18 నుంచి 20 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందనే అంచనాతో సీసీఐ ఆధ్వర్యంలో తొమ్మిది కేంద్రాల్లో కొనుగోళ్లు చేపడుతున్నట్లు తెలిపారు. సీసీఐ నిబంధనల ప్రకారం పత్తి కొనుగోళ్లు ఉంటాయన్నారు. వరిలో సన్న రకానికి ప్రభుత్వం రూ.500 చొప్పున బోనస్ ప్రకటించిందని, రుణమాఫీ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, డిసెంబర్ లోపే రూ.13 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని స్పష్టం చేశారు. నిరుపేదలకు దీపావళి కానుకగా ఇందిరిరమ్మ ఇండ్లు ఇవ్వబోతున్నామని తెలిపారు. అంతకుముందు బీరోలు చెరువు ఆధునీకరణ పనులను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ హరినాథబాబు, ఇరిగేషన్ ఎస్‌ఈ మంగలపుడి వెంకటేశ్వర్లు, డీఏవో పుల్లయ్య, నాయకులు బెల్లం శ్రీను, బోడా మంగీలాల్, రామసహాయం నరేశ్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో సిలార్ సాహెబ్ పాల్గొన్నారు.

ఉన్నతమైన ఆలోచనతో సమగ్ర ఇంటింటి సర్వే

- సర్వే నిర్వహణకు ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇవ్వండి
- కుటుంబ సర్వేతో లక్షలాది మంది జీవితాల్లో మార్పు
- వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మధిర, అక్టోబర్ 29: ప్రజా ప్రభుత్వం ఉన్నతమైన ఆలోచనతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపడుతున్నదని, దీనిని విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదేశించారు. మంగళవారం ఖమ్మం జిల్లా మధిర తహసీల్దార్ కార్యాలయం నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లతో డిప్యూటీ సీఎం భట్టి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సర్వేలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే నిర్వహణ విధి విధానాలపై క్యాబినెట్ సమావేశంలో చర్చించి ఆమోదించామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాల అభ్యున్నతికి, వివిధ సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలను మెరుగుపర్చడానికి తగిన ప్రణాళికలు రూపొందించేందుకు ఈ సర్వేను ఉపయోగిస్తామని తెలిపారు. అధికారులు సర్వే నిర్వహించే క్రమంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, కుటుంబ సభ్యులు చెప్పిన వివరాలను అత్యంత గోప్యంగా ఉంచాలని, కుటుంబ సర్వే లక్షలాది మంది జీవితాల్లో మార్పు తీసుకొస్తుందన్నారు. సర్వే నిర్వహణకు అవసరమైన ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లను గుర్తించి వారికి పూర్తిస్థాయిలో శిక్షణ అందించాలన్నారు. నవంబర్ 6వ తేదీ నుంచి సర్వే ప్రారంభించాలని, షెడ్యూల్ ప్రకారం జరిగే విధంగా, కుటుంబ సభ్యుల ఆధార్, రేషన్ కార్డు, ధరణి పాస్ పుస్తకాలు దగ్గర ఉంచుకునేలా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసేందుకు డేటా ఎంట్రీ ఆపరేటర్లను వినియోగించాలన్నారు. రోజువారీ సర్వే పురోగతిని జిల్లాలవారీగా ఏ రోజుకారోజు సాయంత్రం 6 గంటలకు తెలియజేయాలన్నారు. వీసీలో ఆయా ప్రాంతాల్లో రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎస్ శాంతికుమారి, ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన వైద్య కళాశాల ఏవో, జేఏ

రూ.3 లక్షలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మెడికల్ కళాశాలలో రూ.3 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఏవో, జూనియర్ అసిస్టెంట్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబర్ 29: పెండింగ్ బిల్లులు చేసేందుకు ఓ ఏజెన్సీ నిర్వాహకుడి నుంచి రూ.3 లక్షలు లంచం తీసుకుంటూ అకౌంట్స్ ఆఫీసర్, జూనియర్ అసిస్టెంట్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో మంగళవారం చోటు చేసుకుంది. ఏసీబీ డీఎస్పీ రమేశ్ కథనం ప్రకారం.. కొత్తగూడెంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఓ ఏజెన్సీ ద్వారా 49 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. తొమ్మిది నెలలకు సంబంధించి వారి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని చెల్లించేందుకు మెడికల్ కళాశాల అకౌంట్స్ ఆఫీసర్ ఖలీలుల్లా, జూనియర్ అసిసెట్ సుధాకర్ సదరు ఏజెన్సీ నిర్వాహకుడి నుంచి రూ.7 లక్షలు డిమాండ్ చేశారు. దీంతో మొదటి విడతగా రూ.3 లక్షలు చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకున్న ఏజెన్సీ నిర్వాహకుడు అనంతరం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారు పన్నిన పథకం ప్రకారం ఏవో, జూనియర్ అసిస్టెంట్‌కు మంగళవారం రూ.3 లక్షలు లంచం ఇస్తుండగా.. అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు వలపన్ని వారిని పట్టుకున్నారు. కేసు నమోదు చేసిన అధికారులు ఏవో, జూనియర్ అసిస్టెంట్‌ను ఏసీబీ కోర్టుకు తరలించారు.

'ప్రత్యేక విద్య అభ్యర్థుల' సర్టిఫికెట్ల పరిశీలన

సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో దీక్షా రైనా, డీఈవో శర్మ

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 29 : డీఎస్సీ–2024 ప్రత్యేక విద్య విభాగంలో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను నగరంలోని డైట్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. 1:3 నిష్పత్తిలో స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ పోస్టులలో మూడు బృందాలను నియమించగా.. ఎస్‌జీటీ విభాగంలో 41 మంది, స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 20 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ చావా శ్రీను పరిశీలన బృందాలను సమన్వయం చేస్తూ ప్రక్రియను సజావుగా నిర్వహించారు. సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమాన్ని డీఈవో సోమశేఖర శర్మ, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణలతో కలిసి జడ్పీ సీఈవో దీక్షా రైనా పరిశీలించారు. బుధవారం కూడా పరిశీలన కార్యక్రమం కొనసాగనున్నది.

భద్రాద్రి కొత్తగూడెంలో..

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబర్ 29 : డీఎస్సీ–2024కు సంబంధించి 1:3 నిష్పత్తిలో ఎంపికైన స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థుల సర్టిఫికెట్లను మంగళవారం డీఈవో కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో ఎం.వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు అర్హులైన అభ్యర్థుల సర్టిఫికెట్లను ప్రత్యేక కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించామన్నారు. మొదటి రోజు 20 మంది హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరల్ అధికారులు ఎన్.సతీశ్‌కుమార్, ఎస్‌కే సైదులు, హెచ్‌ఎంలు పద్మలత, బీవీఎల్ కుమార్, సిద్ధయ్య, నరేశ్ పాల్గొన్నారు.

భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట ఏఈవోల ధర్నా

రైతు నేస్తం కార్యక్రమంలో నేలపై కూర్చొని నిరసన

కొత్తగూడెంలో నేలపై కూర్చొని నిరసన తెలుపుతున్న వ్యవసాయ విస్తరణ అధికారులు

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): డిజిటల్ సర్వే చేస్తేనే మీ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన సర్కారు నేటికీ సమస్యలు పరిష్కరించకపోవడంతో వ్యవసాయ విస్తరణాధికారులు(ఏఈవో) రోడ్డెక్కారు. భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. గతంలో ధర్నా, ఆందోళనలు చేసిన ఏఈవోలను ఉన్నతాధికారుల సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. వారిని విధుల్లోకి తీసుకుని నిరసన తెలిపిన కాలానికి కూడా వేతనం ఇవ్వాలని, డిజిటల్ సర్వే చేయడానికి సహాయకులను నియమించడంతోపాటు అపరిష్కృత సమస్యలు పరిష్కరిస్తామని వారం రోజుల క్రితం వ్యవసాయ శాఖ డైరెక్టర్ హామీ ఇవ్వడంతోపాటు సస్పెన్షన్‌కు గురైన వారిని తిరిగి విధుల్లోకి తీసుకుంటామని చెప్పిన సంగతి తెలిసిందే. అయితే ఈ నెల 28న చర్చలకు పిలిచి మాట్లాడుతామని చెప్పి ఇంకా చర్చలకు పిలవలేదని ఏఈవోల సంఘం నాయకుడు నరసింహ ఆరోపించారు. దీంతోపాటు మంగళవారం జరిగిన రైతు నేస్తం కార్యక్రమంలో సైతం ఏఈవోలు నేలపై కూర్చొని నిరసన తెలిపారు.

పెన్‌డౌన్ చేస్తాం..

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోతే పెన్‌డౌన్ చేస్తామని ఏఈవోల సంఘం నాయకుడు నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజులపాటు వేచి చూస్తామని, అప్పటికి అధికారులు స్పందించకపోతే ఆందోళనలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు.

ఖమ్మంలో కొనసాగుతున్న నిరసన

నల్లబ్యాడ్జీలు ధరించి వీసీకి హాజరైన వ్యవసాయ విస్తరణ అధికారులు


ఖమ్మం జిల్లాలో నల్లబ్యాడ్జీలు ధరించి నేలపై కూర్చొని వీసీలో నిరసన తెలుపుతున్న ఏఈవోలు

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 29: వ్యవసాయ శాఖ విస్తరణ అధికారుల నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. విధులకు హాజరవుతూనే వారు తమ నిరసనను ప్రభుత్వానికి తెలియజేస్తున్నారు. డిజిటల్ క్రాప్ సర్వే కఠినతరంగా ఉంటున్నందున.. మాతృశాఖ పనులతో సమాంతరంగా దానిని చేయలేమంటూ దాదాపు నెల రోజుల క్రితం ఏఈవోలు స్పష్టం చేశారు. అయితే ఏఈవోలు ఆ సర్వేను చేయాల్సిందేనన్న ప్రభుత్వ ఆదేశాలను ఉన్నతాధికారులు పాటించారు. ఏఈవోలపై ప్రభుత్వ ఆదేశాలను అమలు చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఏఈవోలు అప్పటి నుంచి నిరసన తెలియజేస్తూనే విధులకు హాజరవుతున్నారు. కానీ ఆన్‌లైన్‌లో మాత్రం వారి హాజరు నమోదు కావడం లేదు. డిజిటల్ క్రాప్ సర్వేకు ససేమిరా అనడంతో రాష్ట్రవ్యాప్తంగా వివిధ కారణాలతో 80 మంది ఏఈవోలపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. అయితే వ్యవసాయ శాఖ డైరెక్టర్‌తో ఏఈవోల సంఘం రాష్ట్ర కమిటీ బాధ్యులు ఈ నెల 24న సమావేశమయ్యారు. మూడు రోజులపాటు సర్వే చేసిన అనంతరం వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డైరెక్టర్ ఇచ్చిన హామీ మేరకు ఏఈవోలు సర్వే ప్రక్రియను ప్రారంభించారు. అయితే, ఐదు రోజులు కావస్తున్నా రాష్ట్ర వ్యవసాయ శాఖ నుంచి స్పందన లేకపోవడం, సమస్యలు పరిష్కారం కాకపోవడం, సస్పెన్షన్‌కు గురైన ఏఈవోలను తిరిగి విధుల్లోకి తీసుకోకపోవడం వంటి కారణాలతో తాజాగా మరోసారి ఏఈవోలు నిరసన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. అందులో భాగంగానే ప్రతి మంగళవారం రైతువేదికల్లో జరిగే వీడియో కాన్ఫరెన్స్‌లకు హాజరయ్యారు. కానీ నల్లబ్యాడ్జీలు ధరించి, నేలపై కూర్చొని నిరసన తెలియజేస్తూ వీసీలో పాల్గొన్నారు.